# రూ.58 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, కుడా చైర్మన్ డిసిసి అధ్యక్షులు ఇనగాల, జిల్లా కలెక్టర్

మహా వరంగల్ బ్యూరో : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ పరిధిలో గల రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ నిధులు రూ.58 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ విగ్రహం నూతన పార్కు అభివృద్ధి పనులకు గురువారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ..దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు ,దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ గారు నిరంతరం పనిచేశారు అన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూముల కోల్పోయిన భూ నిర్వాసితులకు రుణపడి ఉంటాము అని, రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో మెరుగైన వసతులతో కూడిన ఆధునిక మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా ఆ ప్రాంతాని అభివృద్ధి చేసేందుకు రాజీవ్ గాంధీ టౌన్షిప్ పేరు పెట్టడం హర్షనీయమని వారు పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేలా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో కూడా సిపిఓ అజిత్ రెడ్డి, గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్, సంగెం తాసిల్దార్ రాజ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# రోడ్ల పై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు

**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**
**పార్కింగ్ స్థలాలను పరిశీలించిన సీపి**
**పార్కింగ్ స్థలాల క్షేత్రస్థాయి పరిశీలన**

మహా వరంగల్ బ్యూరో: ట్రై సిటీ లోనీ వరంగల్,హనుమకొండ, కాజీపేట పరిధిలో వాహనాలు, ట్రాఫిక్ సమస్యలు రోజు రోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రోడ్డు పక్కనే స్ట్రీట్ వెండర్స్, పార్కింగ్ ఇలాంటి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కసరత్తు ప్రారంభించింది. హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రధాన రోడ్డు మార్గాల్లో వాహన పార్కింగ్ సమస్యలను తీర్చేందుకు అనువైన స్థలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఉదయం సంబంధిత పోలీస్, మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీపీ సన్ ప్రీత్ సింగ్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం హనుమకొండలోని అశోక జంక్షన్, హనుమకొండ చౌరస్తా, ఏనుగులగడ్డ ప్రాంతాలతో పాటు వరంగల్ లోని పోచమ్మమైదాన్, హెడ్ పోస్టాఫీస్ జంక్షన్లను సందర్శించింది. ఆయా ప్రాంతాల్లో లభ్యతగా ఉన్న ఖాళీ స్థలాలు, వాటి విస్తీర్ణం అందులో నూతన పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాల పై అధికారులతో రోడ్డు పైనే సుదీర్ఘంగా చర్చించారు. పరిశీలనలో సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా నేహా, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు వెంకన్న, సుజాత, హనుమకొండ, మట్టెవాడ ఇన్స్పెక్టర్లు మచ్చ శివకుమార్, ఎన్ కరుణాకర్ తో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హెరిటేజ్ సైట్, టూరిస్ట్ ప్లేస్ పోటీలకు ఆహ్వానం

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ జిల్లా లోని చారిత్రక, అలాగే పర్యాటక ప్రదేశాల ప్రాచుర్యం కోసం అన్ హిస్టరీ ఆఫ్ హెరిటేజ్ సైట్, టూరిస్ట్ ప్లేస్ కాంపిటీషన్ 2026 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.ఈ పోటీల్లో భాగంగా ప్రజలు వరంగల్ జిల్లాలోని చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించి జియో ట్యాగ్ చేసిన సెల్ఫీలు లేదా ఫోటోలను పంపాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో కలిసి హెరిటేజ్ ప్రదేశాలను సందర్శించి రూపొందించిన వీడియోలను కూడా పంపవచ్చని తెలిపారు. ఉత్తమ వీడియోలకు నగదు బహుమతులు ప్రకటించారు.ప్రథమ బహుమతిగా రూ.15 వేల, ద్వితీయ బహుమతిగా రూ.10 వేల, తృతీయ బహుమతిగా రూ.5 వేల నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఇన్ఫ్లుయెన్సర్లు తాము సందర్శించిన చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై ఆకర్షణీయమైన వీడియోలు రూపొందించి ప్రచారం చేయాలని అన్నారు. వరల్డ్ టూరిజం డే సందర్భంగా ఉత్తమ ఇన్ఫ్లుయెన్సర్లకు సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను జూన్ 12, 2026లోపు 9290010949 లేదా 7995503018 వాట్సాప్ నంబర్లకు పంపించాలని సూచించారు. పూర్తి మార్గదర్శకాల కోసం కూడా ఇదే నంబర్లను సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.





# దివ్యాంగులకు త్వరగా సదరం సర్టిఫికెట్లు అందించాలి

- **హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్**
- **మహా వరంగల్ బ్యూరో : హనుమకొండ జిల్లాలోని దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు**

కలగకుండా సదరం సర్టిఫికెట్లు, యుడిఐడి కార్డులను త్వరితగతిన అందజేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రి, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక సదరం, యుడిఐడి క్యాంపులను గురువారం ఆమె స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపుల్లో దివ్యాంగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అసెస్మెంట్ ప్రక్రియ, ఆన్లైన్ అప్లోడ్ విధానాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. దివ్యాంగులకు వైద్య పరీక్షలు పూర్తి చేసి, అక్కడికక్కడే సదరం సర్టిఫికెట్లు జారీ చేసే విధానాన్ని ఆమె స్వయంగా పర్యవేక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపులకు వచ్చే దివ్యాంగుల కోసం త్రాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు, ప్రత్యేక కౌంటర్లు తదితర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని సదరం సర్టిఫికెట్ ప్రక్రియ పూర్తయిన అనంతరం, యుడిఐడి కార్డులను లబ్దిదారుల ఇళ్లకు నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీఆర్డీఓ మేన శ్రీనివాస్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్ర రెడ్డి, డీపీఎం శ్రీనివాస స్వామి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కూల్చిన చోటే హనుమాన్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి

- **భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు**
- **విందు రాజకీయాలతో ఆలయ స్థలాలు ధారాదత్తం**
- **మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

మహా వరంగల్ బ్యూరో: ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు వారి మనోభావాలు దెబ్బ తినేలా వ్యవహరించడం సిగ్గుచేటు అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హనుమకొండ జిల్లా కాజీపేట ప్రజా ప్రతినిధులుగాఉన్నవారు భక్తుల మనోభావాలను గౌరవించాలని, మతాచారాలను కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి కాజీపేట మండలం న్యూ శాయంపేటలోని ప్రసిద్ధ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయాన్నిగురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. న్యూశాయంపేట లోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని వినయ్ భాస్కర్ గుర్తుచేశారు. హనుమాన్ మాలధారులు 41 రోజుల పాటు అత్యంత నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో కొలిచిన హనుమాన్ విగ్రహాన్ని కూల్చివేయడం అత్యంత విచారకరమని, ఇది భక్తుల మనోభావాల పై జరిగిన దాడి అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడైతేవిగ్రహాన్ని కూల్చివేశారో, అదే స్థలంలో తిరిగి హనుమాన్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని మతాల, అన్ని కులాల విశ్వాసాలను సమానంగా గౌరవించామని బీఆర్ఎస్ హయాంలో హనుమకొండ పట్టణంలోని ఏ ఒక్క చర్చ్ , మసీదు, దేవాలయం లేదా పాఠశాల జోలికి వెళ్లకుండా, అందరి నమ్మకాన్ని కాపాడామని స్పష్టం చేశారు. ప్రస్తుత అధికార పక్షంలోని కొందరు నాయకులు విందు రాజకీయాలు చేస్తూ, అవినీతి, దోపిడీకి తెగబడుతున్నారని దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. దేవుడి స్థలాన్ని సైతం వదలకుండా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారని, దేవాలయాలను, విగ్రహాలను కూల్చుతున్న వారికి కాలం చెల్లుతుందని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఆంజనేయ స్వామి జోలికి వచ్చిన వారికి ఆ దేవుడే తగిన బుద్ధి చెబుతాడన్నారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో హనుమాన్ భక్తులకు కావలసిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.





# రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**

**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, నెక్కొండలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, డీసీఓ నీరజ, డీఎం సివిల్ సప్లైస్ సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఆర్‌డీఓ నాగ పద్మజ , వ్యవసాయ శాఖ అధికారితదితర అధికారులు పాల్గొన్నారు.పాపయ్యపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు.రైస్ మిల్లర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాధాకృష్ణ రైస్ మిల్లును కూడా సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, రైతుల ధాన్యాన్ని దించడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యజమానికి సూచించారు.అనంతరం నెక్కొండలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈసారి మొక్కజొన్న దిగుబడి అధికంగా వచ్చినందున రైతులకు ఇబ్బందులు కలగకుండా హమాలీల సంఖ్యను పెంచి, సరుకు సురక్షితంగా గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సెంటర్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# జీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

మహా వరంగల్ బ్యూరో;రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత, 20 డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ తో పాటు కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్ గురువారం ఎంజిఎం సర్కిల్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశానికి అందించిన ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోరంటాల రాజు, తోట బాలరాజు, సింగారపు చిరంజీవి, పెండ్యాల కొమరయ్య, పెండ్యాల స్వరాజ్, గొర్రె ప్రశాంత్, మార్త ఆంజనేయులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు రాజీవ్ గాంధీ

- **ఆధునిక భారత స్వాప్నికుడు, సంస్కరణల సృష్టికర్త**
- **మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ**
- **మాజీ ప్రధానికి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే రంగారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: ఆధునిక భారత స్వాప్నికుడు, సంస్కరణల సృష్టికర్త, మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మహనీయుడికి, కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నాం అని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు రాజీవ్ గాంధీ అమలు చేసిన సంస్కరణల పుణ్యమే. విద్య, సాంకేతికత, గ్రామీణాభివృద్ధి,ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు...
ఐటీ రంగానికి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ గారిది ఎన్నటికీ చెరగని ముద్ర. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు , యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ పాలన ఆచరణీయం. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరికి ఎంతో స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు..

